# శ్రీ సన్నిధానం

రామానుజార్య దివ్యాజ్ఞా వర్ధతాం । అభివర్ధతామ్।

మే 2022



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో


3. సంపాదకీయం

4. వైశాఖ మాసం విశిష్టత

5. మన దేవాలయాలు

6. రామానుజ సుధామాధురి

సంఖ్యాసమన్వయం – యతిరాజవైభవం

7. వైదిక ధర్మాచార్యులకు వందనం

9. స్తంభోద్భవం-దివ్యోత్సవం

11. బాలవిజ్ఞానం –

అంతకు ఇంత అయితే ఇంతకు ఎంత?

12. శ్రీసన్నిధి పదకేళి



**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్

డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ అమరవాది వెంకటనర్సింహా చార్యులు




# ముఖచిత్ర పరిచయం

ఎవరైతే నృసింహస్వామిని మనసారా తలుచుకుని పూజిస్తారో వారికి కష్టాలు దరి చేరవన్న నమ్మకాన్ని కలిగించి, నేనున్నాను అన్న విశ్వాసాన్ని కలిగించిన అవతారం నృసింహ అవతారం. ప్రహ్లాద వరదుడు, భక్తజన రక్షకుడు నారసింహుడు.

మాతా నృసింహ, పితా నృసింహ!
భ్రాతా నృసింహ, సఖా నృసింహ!!
విద్యా నృసింహ, ద్రవిణం నృసింహ!
స్వామీ నృసింహ, సకలం నృసింహ!! అని ఎవరైతే తలుస్తారో వారికి అనునిత్యం స్వామి అండదండలు ఉంటాయి. కేవలం కొబ్బెరి బెల్లాలు సమర్పిస్తూ తులసిమాలలు, ఎర్రని పూమాలలు నిర్దిష్టమైన రోజులలో స్వామికి అలంకరిస్తే చాలు కోరిన కోర్కెలు తీర్చుతాడన్నది జగమెరిగిన సత్యం. అందుకే నృసింహక్షేత్రాలు, నృసింహ జయంతి ఉత్సవాలలో భక్తులతో కిటకిటలాడుతుంటాయి.

శైవ – శ్రీవైష్ణవుల ఆచార్యులు ఆవిర్భవించిన రోజు ఈ సంవత్సరంలో ఈనెలలో ఒకే రోజు రావడం యదృచ్ఛికం. ఒకరిది అద్వైతం! కాగా మరొకరిది విశిష్టాద్వైతం!! సంస్కృతి సంప్రదాయాలకు వారే మార్గదర్శకులు సంస్కర్తలు.


**PUBLISHED BY :** డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్



చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 0878 2933323; 9502583323;



నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# సంపాదకీయం

## సంస్కృతీ - సంప్రదాయ వికాసానికి మూలపురుషులు మహానుభావులు

త్రిమతాచార్యులలో ఇరువురు ఆవిర్భవించిన రోజు ఈ సంవత్సరం వైశాఖమాసంలో ఒకటిగా రావడం మన అదృష్టం. అద్వైతం, విశిష్టాద్వైతం వేరయినా వారు అనుసరించిన మార్గాలలో ఎన్నో సంస్కరణలు, మరెన్నో అద్భుతమైన ఘటనలు. వారిరువు సాధించినది, వాటిలో మనకు తెలిసినది కొంతే. అయితే అందులో అణువణువునా మంచి దాగివుంది. మన సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందేలా ఉజ్వల చరిత్రను సృష్టించారు. ఎన్నోరచనలను, మనకు అందించారు.

మన ఆచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్న జీయ్యరు వారు గత సంవత్సరం కార్తీకదీపోత్సవం ప్రవచనంలో వెల్లడిచేసినట్లు శంకరభగవత్పాదుల వారి జీవన విధానాన్ని సోదాహరణంగా గుర్తుచేసుకోవడం ఇక్కడ సమంజసమనిపిస్తుంది. 32 సంవత్సరాల కాలం శంకరభగవత్పాదులు జీవించి ఉన్నారు. కొద్దిపాటి సమయంలో ఆ మహనీయుడు సాధించినటువంటి కార్యాలు వర్ణనాతీతం. వారి రచనలలో కొన్ని స్తోత్రాలు మన కందరికీ అనునిత్యం పారయణాలు అయ్యాయి. త్రిమతాచార్యులలో వీరు ప్రథములు. బ్రహ్మసూత్రములకు అద్వైత సంప్రదాయంలో భాష్యం రచించారు.

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

ఆతరువాత అవతరించిన భగవత్‌రామానుజులు అందించిన గ్రంథాలు మన జీవన గమనానికి చక్కని బాటలు వేశాయి. కర్తవ్యదీక్షలో ప్రదర్శించవలసిన ధైర్యానికి, దేవునిపై చూపవలసిన అనన్య సామాన్యమైన నమ్మకానికీ, సాటిలేని భక్తికీ, రామానుజాచార్యుని జీవితం ఒక ఉదాహరణ. విశిష్టాద్వైతమును ప్రతిపాదించిన గొప్ప తత్వవేత్త, ఆస్తిక హేతువాది, యోగి, రామానుజాచార్యుడు త్రిమతాచార్యులలో ద్వితీయుడు. బ్రహ్మసూత్రములకు విశిష్టాద్వైత సంప్రదాయంలో భాష్యం రామానుజాచార్యులు అందించారు. ఆ భాష్యానికి సరస్వతీ దేవి స్వయంగా శ్రీభాష్యం అని నామకరణం చేసింది. భగవత్ రామానుజా చార్యులవారు 120 సంవత్సరాల కాలం ఈ భూమ్మీద వేంచేసి ఉండి నలుచెరగులా వారు సంచరించారు. సమాజంలో ఉండేటటువంటి రుగ్మతలను గమనించి వాటిని నిర్మూలించే మహోద్యమాన్ని సాగించారు.

దళితులకి ఆలయ ద్వారాలు తెరిచి భగవంతుని దర్శింప చేసినటువంటి చారిత్రక ప్రథమ ఆచార్యుడు భగవత్‌రామానుజులు. భగవంతుని మంత్రాన్ని అందరికీ అందించిన మహోదార వ్యక్తిత్వం రామానుజాచార్యులది. అందుకే రామానుజాచార్యులు ఒక మత గురువు కాదు ఒక సంఘ సంస్కర్త. మహిళలకు కూడా సాధికారికత అందించి నటువంటి మహనీయుడు భగవద్రామాను జాచార్యుడు.

ముఖ్యంగా సమతామూర్తిని ఆవిష్కరించిన ఆరునెలల లోపే తిరునక్షత్ర పండుగ వచ్చేసింది. మే 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు వరుసగా శ్రీరామానుజ తిరునక్షత్ర మహోత్సవములు నిర్వహించుకోవడం మన మహద్భాగ్యం. శ్రీరామానుజవైభవం, దర్శనం, తిరువీధి ఉత్సవాల్లో పాల్గొనే అవకాశం అందరికీ దక్కనుంది. దాన్ని సద్వినియోగం చేసుకుందాం!

మంచిని పంచి మానవత్వంతో నడుచుకునేలా సమతామార్గం అందించిన ఆచార్యుల ఉపదేశాలు మనకు శిరోధార్యాలు, ఆచరణీయాలు. ఆచార్యనిష్ఠతో అనునిత్యం మనం నడుచుకోడమేకాదు, మనచుట్టూఉన్న సమాజాన్ని నడిపించగలిగినప్పుడే సంస్కృతీ సంప్రదాయ పరిరక్షణకు చైతన్య స్ఫూర్తిని కలిగించిన వారము అవుతాము.

**–చీఫ్ ఎడిటర్**



# వైశాఖ మాసం విశిష్టత



పుడమితల్లి తడవకముందే ప్రకృతి చిగురించి లేత పచ్చని కాంతితో శోభించే కాలం వసంతం! ధరణి లోని ఔషధ అమృతాలు పూచిగురులై పొంగే కాలం వసంతం! ఆ వసంత ఋతువులో రెండో మాసం వైశాఖం! జ్యోతిష్యానికి, ఖగోళానికి, ప్రకృతికి, మానవ జీవనానికి గల సంబంధం అనూహ్యమైనది. ప్రకృతి స్థితిగతులను అనుసరించే మానవ జీవన సరళి ఏర్పడింది. చినుకు కురిసినా విత్తు వేసినా, కోత కోసినా, పంట తీసినా అన్నిటికీ మూలం వాతావరణం. అది నక్షత్ర, కాలగమన విధిననుసరించే ఉంటుంది. సేద్యం ఋతువులను అనుసరించి చేయబడుతుంది. "మధుశ్చ మాధవశ్చ వాసంతికా" అంటే మధు, మాధవ మాసాలు వసంత ఋతువు. మాధవ మాసం అంటే వైశాఖ మాసం "మధురా పుష్పరసేన యోగాన్మధుః మధు ప్రచుర మస్మిన్నస్తీతి మాధవః" అని చైత్ర, వైశాఖ మాసాలను నిర్వచిస్తారు. అంటే తేనెల మాసము పుష్పాలు విస్తారంగా విరిసే కాలము అని అర్థం.. సూర్యునికి దగ్గరగా వచ్చే నక్షత్రాన్ని బట్టి సాంప్రదాయ వ్యవసాయ వేత్తలు కార్తెలు గా చెప్తారు. అందులో సాధారణంగా రోహిణి కార్తె వైశాఖ మాసంలో వస్తుంది. రోహిణిలో రోళ్ళు పగిలే ఎండ కాస్తుంది అని ఒక సామెత ఉంది. మహా పురుషులు ఎందరో వైశాఖమాసంలో అవతరించారు. అక్షయమైన సంపదనిచ్చే అక్షయ తృతీయ, సౌభాగ్య ప్రదమైన కొన్ని వ్రతాలు ఆచరించే పుణ్యకాలం కూడా వైశాఖమే! వైశాఖమాసంలో నృసింహ జయంతి ఉత్సవాలను ప్రత్యేకంగా జరుపుతారు, మన పెద్దలు నిర్దేశించిన రీతిలో పంచాంగ పరంగా వైశాఖ మాసంలో ఆచరించే విశిష్ట దినాలను పరిశీలిద్దాము.

వైశాఖ మాసం లో గృహనిర్మాణ ప్రారంభాలు శుభ ఫలితాలను ఇస్తాయి అని చెబుతారు. రాగి చెట్టును పూజించడం మాధవుణ్ణి అర్చించడం ఈమాసంలో విశేషంగా చెప్పబడింది. అక్షయ తృతీయ పర్వదినము అత్యంత ప్రధానమైనది. ఆరోజు చేసిన పుణ్యకార్యం సత్కార్యం వల్ల అక్షయ ఫలం లభిస్తుందని శాస్త్రవచనం! అందుకే నేటి కాలంలో చాలమంది లక్ష్మీస్వరూపమైన బంగారం, ఆభరణాలు కొనడం ఆచారంగా చేస్తున్నారు. అక్షయ తృతీయరోజు ముత్తయిదువలు గౌరీదేవిని పసుపుతో చేసి ఉయ్యాలలో స్థాపించి అర్చిస్తారు. ఆ రోజు నుండి పూర్ణిమ వరకు వీలున్నట్లుగా ముత్తయిదువలను ఇంటికి పిలిచి కాళ్ళు కడిగి సౌభాగ్య వృద్ధి కొరకు నానబెట్టిన శనగపప్పు బెల్లం పానకం వాయినంగా ఇస్తారు. వేసవి వేడిని ఉపశమింప చేసేలా విసనకర్రలు, పూర్ణకుంభాలు మొదలైనవి దానం చేయడం గొప్ప విశేషం.

"వైశాఖే మాసి రాజేంద్ర! శుక్లపక్షే తృతీయకా
అక్షయా సా తిథిః ప్రోక్తా కృత్తికా రోహిణీ యుతా"

విశేషమైన అక్షయ తృతీయ నాటి దానధర్మాలు శుభఫలితాలు ఇస్తాయి అని శాస్త్రవచనం. కార్తికేయ అభిషేకాలు, లక్ష్మీనారాయణ ఆరాధనలు ఈరోజున ఆచరిస్తారు. తదియ రోజున బలరామ జయంతిని జరుపుకుంటారు ఈనాటి నుండి వ్యవసాయ ప్రధాన కృత్యాలను కూడా మొదలుపెడతారు. ఈనెలలో కొన్ని కూరపాదులు కూడా నాటుతారు. అక్షయ తృతీయ నాడు ప్రముఖ దివ్యక్షేత్రం బద్రీనాథ్ నందు జ్యోతి దర్శనం ఉంటుంది. ఆరు మాసాలుగా హిమపాతం వల్ల మూసివేసిన బద్రీనాథ్ దేవాలయ ద్వారాలు అక్షయ తృతీయ రోజు తెరుచుకుంటాయి. ఆశ్చర్యం ఏమంటే ఆరుమాసాల క్రితం అర్చించిన పుష్పాలు, దీప జ్యోతులు దేదీప్యమానంగా ఈరోజు దర్శనం ఇస్తాయి. ఈ జ్యోతి దర్శనాన్ని విశేషంగా భావిస్తారు. అలాగే సింహాచల మందు వరాహ నరసింహ స్వామి నిజరూప దర్శనం గావించి, అనంతరం చందనోత్సవం జరిపి ఆమూర్తికి చందన లేపనం చేస్తారు. శ్రీ శంకరాచార్యులు అవతరించిన పుణ్యదినం వైశాఖ శుద్ధ పంచమి. తెలుగు తిథుల కాలగణనం ప్రకారం వైశాఖ శుద్ధ షష్ఠి జగదా చార్యులు భగవద్ రామానుజ చార్యులు అవతరించిన దినం. శ్రీహరి పాదోద్భవి అయిన గంగా నది శివుని శిరమున నుండి భూమిపైకి వచ్చిన దినంగా గంగా సప్తమిని జరుపుకుంటారు. వైశాఖ శుద్ధ అష్టమి దుర్గాదేవి పూజను చేస్తారు. వైశాఖ శుద్ధ ఏకాదశి విశేషమైనది ద్వాదశి పరశురామ జయంతిని ఆచరిస్తారు. వైశాఖ శుద్ధ చతుర్దశి శ్రీ నృసింహ జయంతి ఉత్సవాలను చేస్తారు. నరసింహ పుణ్యక్షేత్రాలలో స్తంభోద్భవ పూజలు చేస్తారు. వైశాఖ పూర్ణిమ నాడు విశాఖా తిర్నక్షత్రము శ్రీ నమ్మాళ్వార్లు అవతరించిన దినం. వైశాఖ పూర్ణిమ బుద్ధ పూర్ణిమ అని కూడా అంటారు. పరమ సాత్వికమైన జీవన విధిని విధించిన బుద్ధుడు జన్మించిన దినం. వైశాఖిగా పిలవబడే ఈ రోజు అన్నమయ్య జయంతిని కూడా జరుపుకుంటారు. బహుళ విదియ నాడు నారద జయంతిని జరుపుతారు. ఈ విధంగా వైశాఖ మాసం అనేక పర్వదినాల సమ్మిళితమై అందరికీ ఆనందోత్సాహాలను పంచుతుంది. ★

# గోధూరు స్వామికి బ్రహ్మోత్సవాలు







## మన దేవాలయాలు











జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోధూరు గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఇటీవల వైభవంగా జరిగాయి. గ్రామస్థులంతా భక్తి శ్రద్ధలతో ఉత్సవాలలో పాల్గొనడం విశేషం. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారు 1984వ సంవత్సరంలో శ్రీమాన్ డింగరి లక్ష్మీ నారాయణాచార్యుల వారి అభ్యర్థన మేరకు విచ్చేసి శ్రీవారి కరకమలములతో ప్రతిష్ఠించారు. నాటి నుండి సుమారు 38 సంవత్సరాలుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. చైత్ర శుద్ధ ఏకాదశి ఏప్రిల్ 12 నుంచి త్రయాహ్నిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమై, ద్వాదశి నాడు స్వామి వారి కళ్యాణం, డోలోత్సవం, తెప్పోత్సవం, ఏకాంతసేవతో కన్నుల పండుగగా జరిగాయి. కార్యక్రమములో దేవాలయం చైర్మన్ నాగరాజు, సర్పంచ్ సోమా ప్రభాకర్, ఎంపిపి జాజాల భీమేశ్వరి జగన్‌రావు, కోటగిరి వెంకటస్వామి, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలే కాకుండా చుట్టుప్రక్కల గ్రామాల నుంచి కూడా ఎంతో మంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకొన్నారు. యజ్ఞాచార్య మాధవాచార్యలు, అర్చకులు డింగరి లక్ష్మణ మూర్తి తదితరులు ఉత్సవాలు నిర్వహించారు. ఈ సంవత్సరం గతంలోలాగే భక్తజన సందోహంతో ఉత్సవాలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని సర్పంచ్ సోమా ప్రభాకర్ తెలిపారు. కరోనా ప్రభావంతో గత రెండు సంవత్సరాలుగా భక్తులకు అనుమతి లేకుండా ఉత్సవాలు నిర్వహించడం జరిగిందని వారు గుర్తుచేశారు.


**మీరు భాగస్వాములు కండి!!**

మీ గ్రామంలో ఆలయం విషయాలను విశేషాలను శ్రీసన్నిధానం పాఠకులతో పంచుకోండి. ఆలయాల వైభవాలను వెల్లడించడానికి చక్కని ఫొటోలు అందిస్తూ మీభావస్ఫూర్తితో వివరాలు మాకు అందజేయండి.


**పంపవలసిన వాట్సాప్ నంబర్**

**9502583323**

# శ్రీరామానుజ సుధామాధురి

## సంఖ్యాసమన్వయం - యతిరాజవైభవం

**మే 5 శ్రీభగవద్రామానుజాచార్యుల తిరునక్షత్ర మహోత్సవం సందర్భంగా ప్రత్యేక వ్యాసం**



సృష్ట్యాది నుండి బీజాక్షరాలకు, సంఖ్యాప్రశస్తికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. గణితం, గణకం, గుణకం ఇవిలేని మానవ జీవితమే లేదు. ప్రాచీనశాస్త్రాలకైనా ఆధునిక సాంకేతికతకైనా సంఖ్యా విశ్లేషణనే అత్యంత ప్రధానమైనది. ప్రకృతిధర్మం కూడా నిశ్చితమైన గణితసూత్రం మూలంగానే నడుస్తుంది. భారతీయ మహర్షులు సంఖ్యానియతిని అనంతంచేసే శూన్యాన్ని అనగా పూర్ణబిందువు విలువను కనుగొని ప్రపంచానికి అందించారు. అదృష్టమైన, అలౌకికమైన విషయావగాహనకు శాస్త్రకారులు సంఖ్యలకూడిక, వ్యంజనం, గుణకం, విభజన ప్రక్రియలనే వాడతారు. ఈ విధంగా అన్నింటికీ మూలం అయిన సంఖ్యా సమన్వయంతో మనజగద్గురువులైన యతిరాజుల జీవనవైభవం ఎలాముడిపడి ఉందో తెలుసుకుందాము. "రామానుజ'' అనే నాలుగు సమర్థవంతమైన అక్షరాల మంత్రము మానవ జీవనవిధానానికి మార్గదర్శకమైంది. ఆసేతు హిమాచల పర్యంతం భారతదేశ ఆధ్యాత్మిక మూలాలకు మూలసిద్ధాంతం అయింది అని పెద్దలమాట!

ఏకః :- అకారవాచ్యుడైన శ్రీమన్నారాయణుడు "ఏకోనారాయణ అని ఏకశబ్దంతో సంభావింపడతాడు.'' ఏకోనారాయణః నద్వితీయోస్తికశ్చిత్'' అనే సత్యాన్ని లోకానికి ఎరుకపరుస్తూ పరతత్వ నిర్ణయాన్ని శ్రీభగవద్రామానుజాచార్యులు చేశారు "అనంతజ్ఞానానందైకస్వరూప!'' అని గద్యత్రయంలో భగవంతుని కళ్యాణగుణాలను స్తుతించారు. జగత్కారణమైన పరతత్వము ఒకటేనని ఉభయవేదాంతసారంగా నిరూపించారు.అట్లే భగవంతుని పొందుటకు మోక్షఉపాయము ఒక్కటే, భగవత్ప్రాప్తి సాధనము ప్రపత్తి మార్గం ఒక్కటే, అని నిరూపించారు. ఓం ఇతి ఏకాక్షరం బ్రహ్మ' అని నిరూపించి ఆచార్య రత్నమాలలో ఒకేప్రధానరత్నంగా శ్రీరామానుజాచార్యులు నిలిచారు.

ద్వయం:-రామానుజసిద్ధాంతంలో లక్ష్మీదేవి పురుషకారంగా భగవత్ప్రాప్తిని పొందుట అనేది ప్రధానము అందుకే మహాలక్ష్మీ సమేతంగా పరమాత్ముని ఉపాసించడం అనే సాంప్రదాయం స్థిరం చేశారు. శ్రీరంగంలో ఒకపర్వదినంలో పెరియపెరుమాళ్, శ్రీరంగనాచ్చియార్ ఒకేశేర్తిపైన కొలువు తీరినఉత్సవంలో శ్రీరామానుజాచార్యులు గద్యత్రయాన్ని విన్నవించి శ్రీశ్రియఃపతులకు శరణాగతిచేశారు. మొదట లక్ష్మీగద్యంతో ప్రారంభించి ఒకగొప్ప సాంప్రదాయాన్ని నెలకొల్పారు. ఆవిధంగా రామానుజసిద్ధాంతం శ్రీసిద్ధాంతంగా పేరుగాంచింది. ఉపదేశ శ్రీసూక్తిరచనల్లో "శ్రియఃపతియాయ్'' అని ప్రారంభించే సంప్రదాయాన్ని నెలకొల్పారు. మరియు ద్వయమంత్ర ప్రాధాన్యం తెలిపి ప్రపన్నులకు అనుష్టాన విధిని విధించారు.

త్రయం:- శ్రీరామానుజాచార్యులు తత్త్వత్రయాన్ని వేదసారంగా ప్రతిపాదించి శరీర శరీరి సిద్ధాంతాన్నినిరూపించారు. చిత్తు, అచిత్తు ఈశ్వర తత్వాలను తెలిపారు. జడమైన ప్రకృతి, జ్ఞానస్వరూపుడైన ఆత్మ, సర్వజ్ఞుడు సర్వనియామకుడైన పరమాత్మ ఈ మూడుతత్వాలను విశ్లేషించారు. అట్లే రహస్య త్రయార్థములనుపదేశించి, అనుష్టానాన్ని విధించారు. ఆచార్య సమాశ్రయణం పురస్సరంగా మంత్రరాజ, ద్వయమంత్ర. భగవద్గీతాంతర్గత చరమశ్లోక అనుసంధానాన్ని తెలిపారు. ఆచార్యులైన ఆళవందారులు పరమపదించిన తర్వాత అక్కడకు చేరుకున్న శ్రీరామానుజాచార్యులు వారి ముడిచిన మూడు వేళ్ళను 3 ప్రతిజ్ఞలు చేసి తెరిపించారు. అవి: 1) బ్రహ్మ సూత్రములకు విశిష్టాద్వైతరీత్యా భాష్యమును వ్రాయుట, 2) నారాయణ పరతత్వాన్ని తెలిపిన పరాశరవ్యాసుల తిరునామాన్ని ప్రకాశింపచేయుట. 3) సంస్కృత వేదసారమయిన ద్రావిడవేదాన్ని శ్రీనమ్మాళ్వారు తిరువాయ్మొళికి వ్యాఖ్యానాలను రచింపచేయుట అను మూడు ప్రతిజ్ఞలు గావించారు.

చతుర్:- నాలుగువేల పత్తులు గల నాలాయిర దివ్యప్రబంధాలకు శ్రీరామానుజాచార్యులు వ్యాఖ్యానాలను వ్రాయించారు. "రామానుజ'' అను నాలుగు అక్షరాల నామమంత్రముతో అందరిని తరింపచేశారు. ఒకగ్రామంలో 74 తూముల గల ఆనకట్టను తాను చూచి ఆస్ఫూర్తితో సిద్ధాంత ప్రచారానికి లోకోద్ధరణకు 74 పీఠాలను స్థాపించారు. తమ శిష్యులను ఆచార్యులుగా ఏర్పాటు చేశారు. త్యాగ, భోగ, పుష్ప జ్ఞాన మంటపాలుగా శ్రీకంచి, శ్రీరంగం, తిరుమల, తిరునారాయణపురం అను నాలుగు దివ్యదేశాల స్ఫూర్తితో జీవితాన్ని సాగించారు

పంచ:- శ్రీ రామానుజాచార్యులు పూర్వాచార్యుల ఆజ్ఞతో పంచాచార్యుల ద్వారా ఉపదేశాలను పొందారు శ్రీయామునాచార్యులు తను ప్రత్యక్ష ఆచార్యులు కాలేక శిష్యులైన ఐదుగురు నంబులను ఏర్పాటు చేశారు. వారు ఉపదేశించిన అంశాలు పెరియనంబి ద్వయమంత్రం, దర్శనవిషయాలు, పంచసంస్కారాలు, నిగమాంతర్గత విషయాలు, పెరియ తిరుమల నంబి శ్రీరామాయణ రహస్యములు, **మిగతా 8 పేజీలో**

# వైదిక ధర్మాచార్యులకు వందనం

సర్వ ప్రపంచానికి ఆదర్శభూతమైనది భారతీయ సంస్కృతి. ఆ సంస్కృతికి మూలమైన వైదిక ధర్మాన్ని నిలబెట్టి పారమార్థిక లక్ష్యాన్ని మనకు ఉపదేశించిన పరమాచార్యులను మనం నిత్యం స్మరించాలి! ఆరాధించాలి! అనుసరించాలి! వారు అవతరించిన వైశాఖ శుద్ధ పంచమి, షష్టి రెండు తిథులు అత్యంత విశేషమైనవి. వైదిక ధర్మాన్ని ఉద్ధరించిన పరమాచార్యులు జన్మించిన రోజు యాదృచ్ఛికంగా ఈ సంవత్సరం ఒకే రోజుగా వచ్చింది. భగవత్ స్వరూపమైన వైదిక ధర్మ గతి కుంటుపడినప్పుడల్లా భగవత్ సంకల్పంతో దేవతలు, నిత్య సూరులు భగవదంశగా ఆచార్య రూపంతో అవతరించి పరమార్థాన్ని ప్రబోధిస్తారు. పరమ ఋషుల ద్వారా అందిన వైదిక సంపదను మన గురువులు ఆచార్యులు వారి సిద్ధాంత ప్రవర్తక శ్రీసూక్తుల ద్వారా అందించి లోకోద్ధరణ గావించారు. "ఆచినోతి శాస్త్రార్థాన్ ఆచారే స్థాపయత్యపి స్వయమాచరతే యస్మాత్ తస్మాదాచార్య ఉచ్యతే" అని శాస్త్ర వచనాలను బోధిస్తూ, ఆచరిస్తూ సమాజ పురోగతికి కృషి చేసే వారే ఆచార్యులు! అలాంటి జగద్గురువులు, జగదాచార్యులు కారణజన్ములై ఉద్భవించిన భారత భూమి పరమపావనం! జగద్గురువులు ఆదిశంకరాచార్యులు, జగదాచార్యులు భగవద్ రామానుజ చార్యులు అవతరించిన వైశాఖ మాసం విశేషమైనది. ఈ సందర్భంగా ఇద్దరు మహాపురుషులైన, యుగ పురుషులను స్మరిస్తూ శ్రీ సన్నిధానం ప్రత్యేక వందనం సమర్పిస్తున్నది.


## శ్రీ ఆదిశంకరాచార్యులు



"శంకరా లోక శంకర"అని సన్యాసాన్ని స్వీకరించిన తర్వాత కూడా అదే దివ్య నామం కలిగిన జగద్గురువులు శంకరభగవత్ పాదులు. సిద్ధాంత ప్రవర్తకులు. అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించి భగవత్స్వరూప తత్త్వాన్ని నిరూపించి, ఆస్తిక సమాజాన్ని స్థాపించారు. అగమ్యగోచరంగా ఆధ్యాత్మిక స్థితిగతులు కొట్టుమిట్టాడే కాలం! కుసంస్కృతులు, నాస్తిక మతాలు ప్రబలే కాలం! వైదికం అనే పేరుతో అవైదికాన్ని ప్రేరేపిస్తున్న కాలంలో జ్ఞాన పరిపూర్ణుడై అవతరించారు. సర్వజ్ఞ పీఠాన్ని అధిష్ఠించారు.శ్రీ శంకరాచార్యులు. భగవత్ పరత్వాన్ని నిరూపించారు. కేరళలోని తిరుచ్చి క్షేత్ర మందలి పరమేశ్వరుని వరప్రసాదియై శివగురువు, ఆర్యాంబ అను దంపతులకు కలాడి గ్రామంలో జన్మించారు. కైలాసవాసుడైన పరమశివుని అవతారంగా శంకరాచార్యులు జన్మించారు. మధుర కంఠ ధ్వనితో అమృత వాక్ఝురితో 74 సిద్ధాంత ప్రవర్తకులను ఓడించారట! ఆ సేతు హిమాచల పర్యంతం పర్యటించి శివ కేశవ ఆలయాలను పునరుద్ధరణ గావించారు. వీరు పరమ విష్ణు భక్తులు కూడా! సరస్వతీ ఉపాసకులు త్రిపుర సుందరి దేవిపై అనేక స్తోత్రాలు రచించారు. గొప్ప నరసింహ భక్తులు. ఒకానొక సమయంలో శంకరాచార్యులకు ఆపద కలిగినప్పుడు నరసింహస్వామి సింహరూపంల ప్రత్యక్షమై శత్రువును తుదముట్టించాడట నృసింహ కరావలంబ స్తోత్రం,

**(మిగతా 8 పేజీలో)**

## శ్రీ భగవద్రామానుజాచార్యులు



"ఆదౌ జగదాధార శ్శేషః" అని సాక్షాత్ ఆదిశేషులు శ్రియఃపతి ఆజ్ఞతో ఉభయ విభూతి నాయకుడై శ్రీ భగవద్ రామానుజాచార్యులుగా అవతరించారు. పార్థసారథి పెరుమాళ్ల అనుగ్రహంతో శ్రీపెరంబుదూర్లో కేశవసూరి, కాంతిమతీ తాయారులకు వీరు వైశాఖ శుద్ధ షష్టి రోజున జన్మించారు. పరమభక్తితో భగవద్ అనుభవ ప్రాప్తి పొందిన ఆళ్వారుల దివ్య ప్రబంధాలైన ద్రావిడ వేదసారంగా వీరు శ్రీ సూక్తులు అనుగ్రహించారు. ఉభయ వేదాంత సారంగా విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. శ్రీ కంచి శ్రీరంగం తిరుమల తిరునారాయణ పురం ఈ నాలుగు పుణ్యక్షేత్రాల వైభవం శ్రీ రామానుజాచార్యుల చరిత్రతో ముడిపడి ఉంటుంది. అడుగంటిపోతున్న ఆధ్యాత్మిక విలువలతో పాటు సామాజిక విలువలను పెంపొందించే ఒక సంస్కర్తగా వీరు సమాజాన్ని ఉద్ధరించారు. కుల వివక్షత స్త్రీ పురుష భేదం లేకుండా అందరూ భగవంతుని పొందే మార్గాన్ని సూచించారు. ఎందరినో దిద్దుబాటు చేశారు. అనేక విష్ణు దేవాలయాలను పునరుద్ధరించి ఆరాధనా విధులను ఏర్పాటు చేశారు. భారత దేశమంతా

**(మిగతా 8 పేజీలో)**

## శ్రీ ఆదిశంకరాచార్యులు

**(7 పేజీ తరువాయి)** పంచాయుధ స్తోత్రం పరాశర బ్రహ్మసూత్రాలకు భాష్యం, గీతాభాష్యం (అద్వైత పరంగా) అనేక స్తోత్రాలు రచించారు. అనేక మందికి ఆరాధనీయుడై, కారణజన్ముడై, జగద్గురువై వైదిక ధర్మాన్ని భారతదేశమంతా స్థాపన గావించారు. శృంగేరి మొదలగు పీఠాధిపత్యాలు ఏర్పాటు చేశారు. నిరుపేద అయిన ఒక గృహిణిని కరుణించి కనకధారాస్తవం తో అమ్మవారిని ప్రార్థించి కనక వర్షం కురిపించిన సన్నివేశం వారి జీవితంలో ప్రసిద్ధమైనది. వీరు పరమ మాతృభక్తి పరాయణులు. కన్న తల్లి కోసం నదినే ఇంటి వద్దకు తెచ్చి ఉంచిన గొప్ప శక్తిమంతులు. భగవద్గీత ఉపదేశించిన శ్రీకృష్ణ పరమాత్ముడు, అష్టాదశ పురాణాలు రచించిన చతుర్వేద విభజన గావించిన శ్రీ వేదవ్యాసులు, ఆదిశంకరాచార్యులు ఈ ముగ్గురిని జగద్గురువులుగా శ్రీ శంకరాచార్యుల భక్తులు శిష్యులు ఆరాధిస్తారు. ★

## శ్రీ భగవద్ రామానుజాచార్యులు

**(7 పేజీ తరువాయి)** పర్యటించారు. పరంపరాగత ఆచార్య వ్యవస్థను, పంచ సంస్కారాలు, మంత్రోపదేశం విధానాన్ని ఏర్పాటు చేశారు. అస్తవ్యస్తమైన దేవాలయ వ్యవస్థలను బాగుచేసి డెబ్బై నాలుగు ఆచార్య పీఠాలను ఏర్పాటు చేశారు. 120 సంవత్సరాలు వారు దివ్య తిరుమేనితో వేంచేసి ఉండి నవరత్నాలు అనే తొమ్మిది గ్రంథాలను రచించారు. బ్రహ్మసూత్రాలకు "శ్రీభాష్యం"గా, మరియు గీతాభాష్యం విశిష్టాద్వైత పరంగా రచించారు. భగవత్ ప్రాప్తికి ప్రపత్తి శరణాగతి మార్గాన్ని సాధనా మార్గంగా ఉపదేశించారు. విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని హేతుబద్ధంగా నిరూపించి శ్రీ వైష్ణవశ్రీని ప్రకాశితం గావించారు. ★

## సంఖ్యాసమన్వయం - యతిరాజవైభవం

**6 పేజీ తరువాయి** తిరుక్కోట్టియూరునంబి తిరుమంత్రం, చరమశ్లోకం. తిరువరంగప్పెరుమాళ్ అరయర్లు పంచమోపాయనిష్ఠ, తిరుమాలైయాండాన్ భగవద్విషయం ఉపదేశించారు. మరియు శ్రీరామానుజాచార్యులు భగవత్ప్రాప్తికి సాధనాలుగా అర్థపంచక జ్ఞానాన్ని గురించి తెలిపారు. సర్వజనులకు 'తాపపుండ్ర నామయాగమంత్ర' అను ఐదుసంస్కారాలను విధించారు. 'పర వ్యూహ విభవ అంతర్యామి అర్చావతారాల' ఆరాధనా ప్రాశస్త్యంగల పాంచరాత్ర ఆగమాన్ని అనేకదేవాలయాల ఆరాధనల్లో నియమనం చేశారు.

షట్:- షట్ప్రశ్నలు (ఆరువార్తలు). ఇవి శ్రీరామానుజాచార్యుల జీవనగతిని నిర్దేశించాయి. శ్రీకంచిలో వారు వేంచేసి ఉన్నప్పుడు తల్లిగారి సూచన మేరకు వరదునికి ప్రీతిపాత్రుడైన తిరుకచ్చినంబివారిని కలుసుకున్నారు. వారు నిత్యం ఏకాంతసేవ సమయానికి ముందు దేవపెరుమాళ్ళతో ప్రత్యక్షంగా సంభాషించేవారట. తన విన్నపాన్ని ప్రశ్నలుగా తిరుకచ్చినంబిగారి ద్వారా తెలిపి సమాధానాలు పొంది కార్యోన్ముఖులు అయినారు. ఆ వార్తలు ఈవిధంగా ఉన్నాయి.

1) సకల దేవతలలో శ్రీమన్నారాయణుడే పరాత్పరుడు. 2) ఆత్మపరమాత్మ రెండువేరు 3) చతుర్విధ ఉపాయాల్లో శరణాగతి, ప్రపత్తి శ్రేష్ఠమైనది. 4) ప్రపన్నునికి అంతిమ స్మృతి నిర్బంధంలేదు. 5) ప్రపన్నునికి శరీరావసానమందు మోక్షము. 6) పూర్ణాచార్యులను, (పెరియనంబిని) ఆశ్రయించాలి.

సప్త: సప్తగిరులు కాలినడకన ఎక్కిశ్రీనివాసుని కలుసుకున్నారు .శ్రీరామానుజాచార్యులు మోకాళ్ళతో తానధిరోహించిన పర్వతాన్ని నేటికీ మోకాళ్ళపర్వతం అనిపిలుస్తారు. 18 సార్లు శ్రీరామాయణ రహస్యాధ్యయనానికి శ్రీరామానుజాచార్యులు తిరుమలకు వేంచేశారు. పుష్పకైంకర్యం ఏర్పాటుచేశారు. శ్రీనివాసపెరుమాళ్లకు శంఖచక్రాలను అలంకరించి ఆరాధన విధులను ఏర్పాటు చేశారు.

అష్ట: నారాయణ అనువాకంలో అష్టాక్షరి గురించి "ఇతిమంత్రోపాసకః వైకుంఠ భువనలోకంగమిష్యతి" అని నిర్ధారింపబడింది. తిరుక్కోట్టియూర్నంబి 17 సార్లు రప్పించుకొని శ్రీరామానుజాచార్యులకు మంత్రోపదేశంచేశారు. మంత్రరాజము ఉత్కృష్టమైనదని భావించి తరింప గోరువారందరికీ శ్రీరామానుజాచార్యులు మంత్రోపదేశం చేశారు. " మంత్రం యత్నేనగోపయేత్" అను నియమం ఉన్నప్పటికీ, ఆచార్య అనుమతి లేకున్నప్పటికీ అందరూ ఉద్ధరింపబడాలని వారుభావించారు. గుడి గోపురంమీద ఎక్కిసామాన్యజనులకు మంత్రాన్ని చాటిచెప్పారని చరిత్రవైభవం. అది రామానుజాచార్యుల సమతాస్ఫూర్తికి, సకలజన కళ్యాణకాంక్షకు ప్రతీక.

నవ: ఆచార్యుల ఆజ్ఞానుసారము ఉభయవేదసార శ్రీసూక్తులను శ్రీరామానుజాచార్యులు వెల్లడించారు. నవరత్నాలుగా కీర్తించు తొమ్మిది గ్రంథాలను రచించారు. అవి: వేదార్థసంగ్రహం, శ్రీభాష్యం, గీతాభాష్యం, వేదాంతదీపం, వేదాంతసారం, శరణాగతి గద్యం, శ్రీరంగగద్యం, శ్రీవైకుంఠగద్యం, నిత్యగ్రంథం.అను నవగ్రంథాలు. జీవునికి పరమాత్మకు గల నవవిధసంబంధాలను ఉపదేశించారు.

దశ: అనేక దేవాలయాలను ఉద్ధరించి దశావతార స్వరూపాలలో వ్యక్తీకృతుడయిన భగవంతుని అర్చాస్వరూపంలో ఆరాధించే నియమావళిని, ఉత్సవ సాంప్రదాయాలను ఏర్పాటు చేశారు. గోదాదేవి మ్రొక్కును తీర్చి 100 గంగాళాల అక్కారు అడెసలు సమర్పించారు. అంతిమకాలంలో శిష్యులను ఉద్దేశించి 82 వార్తలనే ఉపదేశ శ్రీసూక్తులను అనుగ్రహించారు. సహస్ర ముఖాలు గల ఆదిశేషుని అవతారమైన శ్రీరామానుజాచార్యులు సహస్ర ముఖజ్ఞానప్రకాశులై వేలమందిని సిద్ధాంత వర్తనులు గావించారు. షష్టి సంవత్సర చక్రము రెండుమార్లు తిరుగువరకు 120 సంవత్సరములు తమ దివ్యతిరుమేనితో వేంచేసిఉన్నారు. నేడు నవక నిర్మాణ ప్రాధాన్యం గల సహస్రాబ్ది సమారోహంతో సమతామూర్తి స్వరూపంతో వేంచేసి ఉన్నారు. శ్రీరామానుజాచార్యుల జీవితచరిత్రలో అనేకచోట్ల సంఖ్యాప్రాధాన్యం కనిపిస్తుంది. ★

# స్తంభోద్భవం-దివ్యోత్సవం



విశాఖే స్వాతి నక్షత్రే    చతుర్దస్యాం మందవాసరే
స్తంభే సంభవోద్భూతం నారసింహ మహం భజే

శ్రీ లక్ష్మి నరసింహ స్వామి జయంతి ఉత్సవాన్ని వైశాఖ శుద్ధ చతుర్దశి స్వాతి నక్షత్రము నందు జరుపుకుంటాము. "నారసింహ వపుః శ్రీమాన్" అని దివ్యమంగళ స్వరూపం గలవాడై స్వామి వామాంక మందు లక్ష్మీదేవి ఆసీనము కాగా శంఖ చక్ర గదా ధరుడై ప్రహ్లాద వరదుడు దర్శనమిస్తాడు. ఆర్త రక్షకుడు దుష్ట శిక్షకుడై క్రోధారుణ నేత్రాలతో ప్రజ్వరిల్లే తేజస్సుతో ఉద్భవించిన నరసింహ స్వామిని దర్శించిన చూపరుల కళ్ళు చెదిరిపోయాయట! ఘీంకార శబ్దాలతో కదిలే స్వామి శరీరంలోని ప్రతి రోమము ఒక ఆయుధంలా తోచిందట! "అటవ్యాం నారసింహశ్చ సర్వతః పాతు కేశవః" అని సింహముఖుడైన శ్రియఃపతి ఘోర అరణ్యాల యందు, రక్షిస్తాడని మరియు సర్వ దుష్టగ్రహ, రాక్షస దోషాలను హరింప చేస్తాడని పురాణవచనం. ప్రహ్లాద వరదుడు అయిన నరసింహ స్వామి విష్ణుమూర్తి నాలుగవ అవతారం. భక్త రక్షణ కోసం తృటి లో ప్రత్యక్షమైన భక్తవత్సలుడు నరసింహ స్వామి. శరణు వేడిన భక్తుల భయాన్ని పోగొట్టి, స్వామి కంటే ముందుగా సుదర్శన భగవానుడే రక్షిస్తాడట! పూర్వం అంబరీషుని రక్షించడానికి సుదర్శన పెరుమాళ్ ఆయన వద్దనే ఉండి నిష్కారణంగా శపించ బోయిన దుర్వాసమహర్షిని అడ్డగిస్తాడు. అట్లే నరసింహావతారంలో కూడా స్వామి హస్త మందే కాకుండా గోర్ల యందు, కోరలయందు అంతటా తాను ఆవహించి ఉన్నాడట! అందుకే దుష్ట సంహరణ రూపమైన సుదర్శన నారసింహమూర్తికి ప్రత్యేక పూజలు చేస్తారు.

ఆగర్భ భక్తుడైన ప్రహ్లాదుడు అంతటా హరిని దర్శించాడు. సదా శ్రీ హరి నామ స్మరణ తప్పకుండా చేసి అనన్య భక్తితో సేవించాడు. నారాయణ నామోపాసనను చేశాడు. చండామార్కులనే వారు ప్రహ్లాదుని గురువులు. వారు పాఠాలు బోధించినా వినని విద్యార్థులందరూ ప్రహ్లాదుని నారాయణ తత్వ బోధనకు పరవశించి పోయేవారు. విష్ణు ద్వేషి అయిన తండ్రి ఎన్ని హింసలకు గురి చేసిన హరి స్మరణతో ఆ బాధ తెలియకుండా ఉన్నాడు ప్రహ్లాదుడు. తన తండ్రికి భగవంతుణ్ని చూపించడానికి సిద్ధంగా ఉన్న భక్త బాలకుణ్ణి చూసి పరమాత్ముడు సంతుష్టుడైనాడు. ఆ భవనంలో ప్రతి అణువులో నరసింహ రూపంతో నిండి ఉన్నాడు. ప్రహ్లాదుడు ఎక్కడ చూపిస్తే అక్కడ ఉద్భవించడానికి సిద్ధంగా ఉన్నాడు. బ్రహ్మ వరప్రసాది అయిన హిరణ్యకశిపుని సంహరించడానికి ఆయుధం,సమయం,స్థలం,స్వరూపం మొదలగు బ్రహ్మ వరాలను అధిగమించే విధంగా ఆవిర్భవించడానికి సిద్ధంగా ఉన్నాడు. "ఇందుగలడందులేడని సందేహము వలదు" అని ప్రహ్లాదుడు సంకల్పించగానే స్తంభోద్భవుడై అవతరించి తృటిలో హిరణ్యకశిపుని సంహరించాడు. ఆ ఉగ్రం, ఆ తేజం సహించలేక దేవతలు కూడా భీతిల్లారు. ఒకే సమయంలో దేవతలు కురిపించిన పుష్పవర్షం, నృసింహ స్వామి క్రోధారుణ జ్వాలలు, రక్త ప్రవాహాలు ప్రాకారాలను కప్పివేశాయి. భక్తి భావంతో, భయంతో విహ్వలమైన సంకోచించే చూపులు పరిసరాలను నింపివేశాయి. అద్భుతం, అపూర్వం అయిన నరసింహ స్వామి దివ్య ఉగ్ర స్వరూపం ప్రహ్లాదుని స్తోత్రంతోనే శాంత రూపం దాల్చిందట!. ప్రహ్లాదుని భక్తి ప్రకర్షకు, ప్రపత్తి నిష్ఠకు పరితుష్టుడయిన నరసింహస్వామి ప్రహ్లాద వరదుడుగా ఉద్భవించాడు కనుక ప్రహ్లాద స్తుతితో శాంత రూపం పొందాడు.

**"తాత ప్రశమయోపేహి స్వ పిత్రే కుపితం ప్రభుం**
**స్వ పాదమూలే పతితం తమర్భకం**
**విలోక్య దేవః కృపయా పరిప్లుతం**
**ఉతాప్య తచ్ఛీర్ష్ణ్య దధాత్ కరాంబుజం"**

అనగా తన తండ్రి పై కోపించిన స్వామి యొక్క పాద మూల మందు పడి వేడుకున్నాడు. అటువంటి ఆ చిన్న పిల్లవాడిని చూసి దయార్ద్రహృదయుడై నరసింహ స్వామి ప్రహ్లాదుని శిరస్సును ఆఘ్రాణించి(వాసన చూసి) తలపై తన కర కమలాన్నుంచి, వాత్సల్యంతో నిమిరాడట! "సాక్షాచ్ఛ్రీః పేశి తా దేవైః దృష్ట్వా తన్మహదద్భుతం అదృష్ట శృత పూర్వత్వాత్ నోపేయాయ విశంకితా" అనగా లక్ష్మీదేవి కూడ ముందెన్నడూ చూడని స్వరూపమును చూచి సంకోచించిదట! శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వైభవం మహాద్భుతమైనది. తెలుగునాట శ్రీ లక్ష్మి నరసింహ క్షేత్రాలు అనేకం ఉన్నాయి. "అటవ్యాం నారసింహః" అని దండకారణ్య ప్రాంతం కావడం మూలంగా చిన్న చిన్న గుట్టలపై నదీతీరాల్లో అనేక పుణ్యక్షేత్రాలు వెలిశాయి. వేదాద్రి యాదాద్రి, ధర్మపురి, సింహాచలం, అహోబిలం, పెంచలకోన, కదిరి ఇలా ఎన్నో పుణ్యక్షేత్రాల్లో నృసింహ జయంత్యుత్సవాలు వైభవంగా జరుగుతాయి. నృసింహ నవరాత్రులు కూడా నిర్వహిస్తారు. జానపదుల ఇష్ట దైవంగా కూడా శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆరాధింపబడతాడు అనేక చోట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు కాకుండా ప్రసిద్ధ జాతరలు కూడా జరుపబడతాయి.

శ్రీలక్ష్మి నృసింహ మమ దేహి కరావలంబం!

# ఆధ్యాత్మిక వార్తల సమాహారం



## ఉగాది పురస్కారాలు పంచాంగం ఆవిష్కరణ

శ్రీవైష్ణవ సేవా సంఘం, కరీంనగర్ శాఖ వారి ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు, పంచాంగం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత సంప్రదాయ ప్రచార సేవకు కృషి చేసిన పండితులు తూపురాణి రంగాచార్యులు, శేషం వేణుగోపాల శర్మ సముద్రాల రామానుజాచార్యులు, సముద్రాల వేణుగోపాలాచార్యులు, సముద్రాల రంగాచార్యులు వారిని శ్రీవైష్ణవ సేవా సంఘం సన్మానించింది. అనంతరం శుభకృత్ నామ సంవత్సర పంచాగం ఆవిష్కరించబడింది. ఈ కార్యక్రమం స్థానిక శ్రీవైష్ణవ సేవా సంఘం వారు నిర్వహించారు. శ్రీవైష్ణవ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీమాన్ పీచర కృష్ణ, ఆచార్య శశికిరణ్, నగర డిప్యుటీ మేయర్ శ్రీమతి చల్లా స్వరూప, హరిశంకర్, డా॥ శ్రీధర్, గౌతమ్ రావు తదితరులు పాల్గొన్నారు.



## సామూహిక ఉపనయన వేడుకలు

సామూహిక ఉపనయన వేడుకలు కరీంనగర్ వేదభవన్‌లో వైభవంగా శ్రీవైష్ణవ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు, కార్యదర్శి పీచర కృష్ణ, ఆచార్య శశికిరణ్ మరియు డాక్టర్ చక్రవర్తుల రమణాచార్యులు తదితరులు పాల్గొన్నారు. . ఉపనయన కార్యక్రమాన్ని సంప్రదాయసిద్ధంగా వేదభవనం ఆచార్యులు, యాజ్ఞీకులు వరప్రసాదాచార్యులు నిర్వహించారు



# పాఠకుల స్పందనలు

పత్రిక పరిమాణం రంగులు మరియు కంటెంట్‌లో బాగుంది. అభినందనలు **–సముద్రాల రఘురామ్ ఆచార్య గాంధీనగర్**

ప్రతి ఇంట్లో ఉండాల్సిన అద్భుతమైన ఆధ్యాత్మిక పత్రిక ఇది. **–శివా రెడ్డి మోదుగుల, మంగళగిరి, గుంటూరు**

ఆధ్యాత్మిక పరిమళం శ్రీసన్నిధానం. **–వెంకట రవి కుమార్ , నెల్లూరు.**

అద్భుతం – **సౌమిత్రి వీణ, బాలసముద్రం, హనంకొండ**

ఆధ్యాత్మిక జ్ఞాన సముపార్జనకు ఉపయోగకరమైన పత్రిక **–డాక్టర్ ఆదిగొప్పుల సదయ్య, జమ్మికుంట, కరీంనగర్**

మంచి పత్రిక – **సముద్రాల ప్రమోదాచార్య, హాజీపూర్, మంచిర్యాల్**

చాలా చాలా చాలా మంచి పత్రిక – **ఎం కృష్ణ మూర్తి, ఇసిఐఎల్, హైదరాబాద్**

ప్రతి ఆధ్యాత్మిక సాధకులకు ఇది చాలా ఉపయోగకరమైన పత్రిక అని నేను ఆశిస్తున్నాను **–డాక్టర్ శ్రీధర్ ముడుంబా, విద్యానగర్, హైదరాబాద్**

సూపర్ –రామకృష్ణమాచార్య, ఖమ్మం – **చలంశెట్టి శ్రీనివాస్ తూర్పు గోదావరి**

## పాఠకులకు ముఖ్య గమనిక

శ్రీసన్నిధానం పత్రిక చదివి పాఠకులు తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా తెలుపడంతో పాటు మాకూ ప్రతినెలా పత్రిక అందించండి. అంటూ చిరునామాలు అందించేవారి సంఖ్య దినదిన ప్రవర్థమానం అవుతోంది. మేము సైతం అనుకున్న వారంతా వెబ్‌పేజీలో వివరాలు నమోదు చేసుకోవాలని మరో మారు విజ్ఞప్తి చేస్తున్నాము.

–మేనేజింగ్ ఎడిటర్

# అంతకు ఇంత అయితే ఇంతకు ఎంత?

త్రికరణ శుద్ధితో చేసే పని ఏదైనా మంచి ప్రయోజనాన్ని కలిగిస్తుంది. మనం చేసే పనిలో మంచి భావన ఎంత ముఖ్యమైనదో మనకు ఈ కథ తెలియజేస్తుంది. మన పెద్దలు చెప్పిన ఈ అమూల్యమైన కథను తెలుసుకుందాం!


ఒక ధనవంతుడు భోగభాగ్యాలు అనుభవిస్తూ చీకూచింతా లేకుండా ఎంతో ఆనందంగా జీవిస్తున్నాడు. పేదరికంతో బాధ పడే తన పక్క వారిని చూసి ఆయన చింతించేవాడు. తన జీవితానికి వారి జీవితానికి గల తేడాలను గురించి ఆలోచించేవాడు. ఒకరోజు ఒక సాధువు వాళ్ళింటికి వచ్చాడు ధనవంతుడు ఆ సాధువును ఆదరించి మర్యాదలు చేసి ఈ విధంగా ప్రశ్నించాడు.

"స్వామి నా జీవితం ఈ విధంగా ధన సంపదలతో సంతోషంగా ఉంది. అందరికీ అలా లేదు కదా! ఎందుకు? అని ప్రశ్నించాడు.

సాధువు వెంటనే నవ్వి అతని పూర్వ జన్మ వృత్తాంతాన్ని అతను చేసిన పుణ్యకార్యాన్ని వివరించాడు " నాయనా నీవు పూర్వజన్మలో ఒక యాచకుడివి. ప్రతిరోజు దొరికింది తిని ఒక చోట నిద్రిస్తూ నిశ్చింతగా ఉండేవాడివి. ఒక రోజు నీకు దొరికిన బిక్షలో కొన్ని పొట్ల గింజలు వచ్చాయి. నీవు తిన్న తరువాత ఆ పాత్రను నీటితో కడిగి నీ నివాసానికి ప్రక్కనే ఉన్నపెంట పైన పడవేసావు. ఆ పొట్ల విత్తనాలు పెంటపై పడడం చేత నీళ్ల పడి పెద్ద పొట్ల పాదులుగా పెరిగాయి. సమృద్ధిగా కాయలు కాసాయి. నీవు ఆ పొట్లకాయ లను అందరికీ పంచిపెట్టావు.వారందరూ తృప్తిగా తిన్నారు. మిగిలినవి నీవు తిన్నావు. నీవు పొట్లకాయలను అమ్ముకోకుండా ఏమి ఆశించకుండా అందరికీ పంచి పెట్టి తిన్నావు. కాబట్టి ఆ పుణ్యఫలితంగా ఈ జన్మలో ఆగర్భ ధనవంతుడు అయ్యావు" అని చెప్పి ఆ సాదువు వెళ్ళిపోయాడు.

ఆ ధనవంతుడు ఎంతో సంతోషించాడు కానీ ఆ సాధువు చెప్పిన దానిలో అంతరార్థం గ్రహించలేకపోయాడు. వెంటనే కొన్ని ఎకరాల భూమిని కొని పొట్ల పాదులు వేయించాడు. విరగ కాసిన పొట్లకాయలను దారినపోయే వారందరికీ పంచాడు. ఇలా గడుస్తుండగా ఒకరోజు మళ్లీ పూర్వపు సాధువు ఆ ధనవంతుని ఇంటికి వచ్చాడు. అతిథి సత్కారాలు అయిన తర్వాత ఆ సాధువు సేదతీరే సమయంలో ధనవంతుడు ఆయన వద్దకు వచ్చాడు సాదువును ఈ విధంగా ప్రశ్నించాడు. "స్వామి చూశారుగా ఎన్ని పొట్లకాయలు దానం చేస్తున్నానో! మరి "అంతకు ఇంత అయితే ఇంతకు ఎంత?" ఆనాడు చేసిన దానానికి ఇంత ధనవంతుణ్ణి అయ్యాను ఈనాడు చేసే దానికి ఎంత ధనవంతుణ్ణి అవుతాను." అని

## బాలవిజ్ఞానం




అడిగాడు. ఆ సాధువు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు. " నాయనా 100 రూపాయలు సంపాదించే వాడికి పదవ వంతు పది రూపాయలు అవుతుంది. కానీ లక్షలు కోట్లు సంపాదించే వాడు పది రూపాయలు దానం చేస్తే అది పదవ వంతు కాదు కదా! నిస్వార్థంగా ఏమీ ఆశించకుండా ఆనాడు దానం చేసి ఫలాన్ని పొందావు. "అంతకు ఇంతైనా ఇంతకు మాత్రం అంతే!" అంటే మళ్లీ పూర్వస్థితే లభిస్తుంది" అని చెప్పాడు. ఆ ధనవంతుడు ఈ ధర్మసూక్ష్మం తెలిసి ఆశ్చర్యపోయాడు. అందుకే

'ఎంత చేశామన్నది కాకుండా ఏ భావంతో చేశాము' అనేదే ముఖ్యం అని మన పెద్దవాళ్ళు చెప్తారు.

# శ్రీసన్నిధి పదకేళి-3



ఈ పదకేళిలో సరియైన సమాధానాలు వ్రాసి మాకు పంపడంతో పాటు ఈ పత్రిక లింకు మీ ఫేస్బుక్ లో షేర్ చేసి దానిని మాకు పంపిన, తరువాతి నెల సంచికలో మీ పేరుతో పాటు మీరు పంపే అడ్రసుకు (ఇండియాలో) ప్రత్యక్షంగా ఆ పత్రిక మీకు అందిస్తాము. ఫిబ్రవరి 2022 సంచిక చదవండి సరియైన జవాబులు వ్రాయండి. ఫలితాలు: జూన్ నెల సంచిక నుండి ఫలితాలు ప్రచురించబడుతాయి. సరియైన జవాబులు మరియు మీ సోషల్ మీడియాలో పెట్టిన వివరాలు వెబ్ లో ఇచ్చిన వాట్సప్ ద్వారా పంపండి. పత్రిక మీ ఇంటికే రావాలంటే వెబ్ లో వున్న అప్లికేషన్ తప్పనిసరి నింపండి. srisannidhanam.org సబ్ స్క్రైబ్ చేయండి.



## ఆధారాలు నిలువు:

1.వేనోళ్ళ స్తుతించే వేయ్యేళ్ళ పండగ.....(4).
2.భూతశుద్ది తోనే ........ (శీర్షిక) 4)
3.ముచ్చింతల్ లో శ్రీసీతారామచంద్రులు వుండేది (5)
4.శ్రీరామానుజ స్వర్ణ మూర్తి ఎవరు ఆవిష్కరించారు(4
5.శ్రీరామానుజులు అవతరించినది (6)

## ఆధారాలు అడ్డం:

5. శ్రీరామానుజులు ఏ పెరుమాళ్ళకు శంకు,చక్రాలు ధరింపచేసారు. (5)

6.7,8,9 నాలుగు యాగమంటపాలు (2)

10. దివ్యదేశాలు ఎన్ని (అంకెల్లో) (3)

11. తిరుమలలో పుష్పకైంకర్యానికి రామానుజులు ఎవరిను ఏర్పాటు చేసారు.(5)

12..............సహస్ర (1035) కుండాత్మక యాగం (5)

13. గురువు ద్వారానే ...............సిద్దిస్తుంది. (2)


**రచనలకు ఆహ్వానం**

సాహిత్యాభిమానులకు, పండితులకు మా శ్రీసన్నిధానం పత్రికలో ఆధ్యాత్మిక సంబంధ వ్యాసాలు, దేవాలయ విశేషాలు, కవితలు, పద్యాలు ఇతర రచనలు పంపించదలచిన వారు సంప్రదించండి.

Whatsup no 9502583323

**త్వరలో రాబోయే శీర్షికలు**






ఆధ్యాత్మిక జ్యోతిష్య ధార్మిక సంబంధిత సందేహాలకు ప్రముఖుల సమాధానాలు

**పత్రిక మీ ఇంటికి రావాలంటే**

srisannidhanam.org

**సబ్ స్క్రైబ్**

**చేయడం మరవకండి.**